సాక్షి చిత్తూరు

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

I



ముమ్మరంగా తనిఖీలు

చిత్తూరు జిల్లాలో శనివారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో తనిఖీ చేశారు. - IIలో



50 మామిడి చెట్లు ధ్వంసం

వెదురుకుప్పం మండలం చెంచుగుడి గ్రామా నికి సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడి, 50 మామిడి చెట్లు ధ్వంసమయ్యాయి. - IIలో



ఐరాలలో చిరుత సంచారం

ఐరాల మండలంలో చిరుత సంచారం ఉన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో జనం భయాందోళన చెందుతున్నారు. - IIలో

న్యూస్‌రీల్

నూతన సంస్కరణలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు అర్బన్: న్యాయ వ్యవస్థలో ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులు, నూతన సంస్కరణలపై న్యాయమూర్తులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులకు 'లా ఆఫ్ రెపుటేషన్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులపై ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు సీనియర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. రిటైర్డు జిల్లా జడ్జిలు కెపి.బాలజీ, ఎస్.జగన్నాథం రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి పలు విషయాలపై న్యాయమూర్తులకు అవగాహన కల్పించారు. న్యాయమూర్తులు రమేష్, భారతి తదితరులు పాల్గొన్నారు.

12 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో 12 మంది డిప్యూటీ ఎంపీడీఓలు, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీడీనెల్లూరు, రామకుప్పం, వెదురుకుప్పం, పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయాల్లో డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉన్న హరిప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ, పురుషోత్తం, రాజశేఖర్‌బాబును చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అలాగే కడప, అనకాపల్లెలో పనిచేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి, శిరీషను చిత్తూరు జిల్లాకు ఇచ్చారు. ఎర్రవారిపాళెం, నాగలాపురంలో విధులు నిర్వహిస్తున్న మాలతి, వెంకటరమణను తిరుపతి జిల్లాకు కేటాయించారు. నగరి, గంగవరం, బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏఓలుగా పనిచేస్తున్న సతీష్, భాస్కర్, మహేష్‌కు ఉద్యోగోన్నతి కల్పించి, చిత్తూరు జిల్లాకు కేటాయించగా, రామసముద్రం ఏఓ గౌస్‌బాషాను కడప జిల్లాకు ఇచ్చారు. వీరికి త్వరలో మండలాలను కేటాయించనున్నారు.

బరితెగింపు

సంఖ్యా బలం లేదు.. సఖ్యతా లేదు.. చైర్మన్ అభ్యర్థి పేరు ఖరారు కాలేదు.. నాకంటే నాకని ఐదారుగురు పోటీ.. అయినా చైర్మన్ గిరి ఎలాగైనా దక్కించుకోవాలని కాలకూటమి కుట్రలు.. కుతంత్రాలు.. కుయుక్తులు పన్నుతోంది. కుదిరితే కౌన్సిలర్ల కొనుగోలు.. లేదంటే అడ్డంకులు సృష్టించి.. పీఠం దక్కించుకోవాలని ఎత్తులు వేస్తోంది. అధికార బలంతో బరితెగిస్తోంది. ప్రజాస్వామ్యమా..కుట్రలా.. గెలుపెవరిది? అన్న చర్చ సర్వత్రా సాగుతోంది.



ఓటమి భయంతో అధికార పార్టీ కుట్రలు

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న అధికార పార్టీ
- కౌన్సిలర్లను అంగడి సరుకులా కొనేందుకు యత్నం
- ఒకరిద్దరు టీడీపీకి మద్దతు తెలిపే అవకాశం
- పార్టీలు మారే కౌన్సిలర్లు తమకొద్దంటున్న ప్రజానీకం
- ఓటింగ్‌కు అడ్డుపడే అవకాశం ఉండడంతో రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు
- కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మరో రామకుప్పం ఎంపీపీ ఎన్నికను తలపించనుందా..?



మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు జరగనున్న కుప్పం ఎంపీడీఓ కార్యాలయం

కుప్పం రూరల్: సంఖ్యా బలం లేకపోయినా ఎలాగైనా కుప్పం మున్సిపల్ చైర్మన్ గిరి దక్కించుకోవాలని అధికార టీడీపీ బరితెగింపులకు పాల్పడుతోంది. ప్రత్యర్థి పార్టీ కౌన్సిలర్లను అంగడి సరుకుల్లా కొనేందుకు బరితెగిస్తున్నారు. ఇప్పటికే ఒకరిద్దరు టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కౌన్సిలర్లు లొంగని పక్షంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను సమావేశానికి రానివ్వకుండా అడ్డుకుని, ప్రత్యేక జీఓల ద్వారా అడ్డదారుల్లో గెలిచే అవకాశాలపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వీరి ఆలోచనలు పసిగట్టిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రక్షణ కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రజాస్వామ్యం గెలుస్తుందా..? అధికార పార్టీ కుతంత్రాలు గెలుస్తాయా? అనేది కుప్పం జనంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పార్టీ ఫిరాయింపులు మంచిది కాదు

కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ ఒకరిద్దరు వైఎస్సార్ సీపీ వారు టీడీపీకి మద్దతు ఇస్తారనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. పార్టీ ఫిర్యాయిస్తారనే కౌన్సిలర్ల పరిధిలోని ప్రజలు మాత్రం ఇది మంచి పద్ధతి కాదని అభిప్రాయపడుతున్నారు. తాము మంచి చేస్తారని ఓట్లు గెలిపిస్తే వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయిస్తే వారికి గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరికలు సైతం చేస్తున్నారు.

మరో రామకుప్పం ఎంపీపీ ఎన్నిక కానుందా?

కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక మరో రామకుప్పం ఎంపీపీ ఎన్నిక కానుందా? అనే అనుమానాలు జనంలో నెలకొన్నాయి. గత నెలలో రామకుప్పం ఎంపీపీ ఎన్నికల్లో కోరం లేకపోయినా టీడీపీ అభ్యర్థులు గెలుపొందినట్లు ప్రకటించుకున్నారు. మండలంలో 16 ఎంపీటీసీ సభ్యులుండగా, ఎంపీపీ అభ్యర్థి శాంతకుమారి అకాలమరణం పొందింది. దీంతో సభ్యుల సంఖ్య 15కు చేరింది. ఎన్నిక నిర్వహించాలంటే కోరం 8 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను ఎన్నికలకు హాజరు కాకుండా అడుగడుగునా అడ్డుకుని, హాజరైన ఆరుగురు టీడీపీ సభ్యులతోనే ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో టీడీపీ అభ్యర్థులే గెలిచినట్లు అధికారులు ప్రత్యేక జీఓ అనే అస్త్రాన్ని ఉపయోగించుకుని గెలుపును నిర్ణయించుకున్నారు. ఇదే తరహాలో కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోలేదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

కోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

అధికార పార్టీ నుంచి తమకు ఇబ్బందులున్నాయని, రక్షణ కల్పించాలని కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. సభ్యులకు రక్షణ కల్పించాలని కోర్టు జిల్లా, స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేసింది. కౌన్సిలర్లు ప్రయాణించే వాహనాల నంబర్లు, ఆధార్‌కార్డులు పోలీసులకు అందజేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించి పత్రాలు అందజేశారు.

షీల్డు కవరే శరణ్యమా?

చైర్మన్ ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా సాగితే వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం. వైఎస్సార్ సీపీలో ఇప్పటికే చైర్మన్ అభ్యర్థి ఎవరనేది అధిష్టానం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. చిక్కల్లా టీడీపీలోనే ఉంది. అడ్డదారుల్లో టీడీపీ చైర్మన్ గిరి దక్కించుకుంటే అభ్యర్థి విషయంలో స్పష్టత లేదు. ఎవరికి వారు తామే చైర్మన్ అని ప్రచారాలు చేసుకుంటున్నారు. 19 వార్డు కౌన్సిలర్ దాము తనకే దక్కాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. 20వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ అయితే అధిష్టానం ఆశీర్వాదం తనకే ఉందని ధీమాగా ఉన్నాడు. 5వ వార్డు కౌన్సిలర్ సెల్వం కుప్పంలో 60 శాతం ఓటర్లు తమ సామాజిక వర్గం వారే ఉన్నారని, తనకు ఇస్తేనే సముచితమని, ఇప్పటికే పలుసార్లు మద్దతు కోసం సామాజిక వర్గ సమావేశాలు నిర్వహించారు. మరో వ్యక్తి కూడా చైర్మన్ గిరిపై ఆశపడుతున్నట్లు తెలుస్తోంది. నలుగురైదుగురు పోటీ ఉన్న నేపథ్యంలో నిర్ణయం అధిష్టానానికి వదిలేస్తారనే వాదన లేకపోలేదు. పైనుంచి వచ్చే షీల్డు కవర్‌లో ఎవరు పేరు ఉంటే వారే చైర్మన్ అన్న అభిప్రాయం లేకపోలేదు.

ప్రత్యర్థి కౌన్సిలర్లను కొనేందుకు టీడీపీ అడ్డదారులు

కుప్పం మున్సిపాలిటీలో టీడీపీకి గెలుపొందే బలం లేక పోవడంతో గెలుపునకు అడ్డదారులను ఎంచుకుంటోంది. టీడీపీ వైపునకు వస్తే భారీస్థాయిలో నగదు ఇస్తామని, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ఎరలు వేస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని, పార్టీలో తగిన స్థానం కల్పిస్తామని ఇలా లేనిపోని ఆశలు చూపుతున్నారు. చివరకు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన వారి ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ప్రలోభాలకు ఒకరిద్దరు మాత్రమే చూచాయిగా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. మిగిలిన వారంతా బెంగళూరులోని క్యాంపులోనే ఉన్నట్లు సమాచారం. టీడీపీ క్యాంపు తమిళనాడు రాష్ట్రం హోసూరు సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌లో కొనసాగుతుండగా, వైఎస్సార్‌సీపీ క్యాంపు బెంగళూరులో ఉన్నట్లు తెలుస్తోంది

సర్వత్రా ఉత్కంఠ

కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక సోమవారం కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎక్కడ చూసినా చైర్మన్ ఎన్నికపైనే చర్చలు సాగుతున్నాయి. టీ షాపులు వద్ద నలుగురు గుమికూడిన ప్రతి చోట చైర్మన్ అభ్యర్థిత్వంపైనే చెవులు కొరుక్కుంటున్నారు. ఒకరు ఒకరికి వస్తుందని, లేదు లేదు మరోకరికి వస్తుందనే వాదనలు నడుమ మాటలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ సోమవారం ఏ పార్టీ వారికి మంచి రోజు అవుతుందో అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

ఆధునిక నేర పోకడపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ఆధునిక సమాజంలో నేరాలు జరుగుతున్న తీరు, ప్రజలు ఎలా మోసాలకు గురవుతున్నారనే విషయాలపై అవగాహన తప్పనిసరని చిత్తూరు ఎస్పీ మణికంఠ అన్నారు. శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త రకాల నేరాలకు పాల్పడుతూ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సైబర్‌క్రైమ్‌పై నిర్లక్ష్యం చేయకుండా ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లు బాధితులు స్టేషన్‌కు వస్తే వెంటనే స్పందించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు సకాలంలో పూర్తి చేయాలని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా, కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిదికాదన్నారు. ఇక నేరస్తుల కదలికలను గుర్తించడానికి రూపొందించిన సీసీటీఎన్ఎస్ యాప్‌ను ఎప్పటికప్పుడు వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. డ్రోన్ల సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించాలన్నారు. మూడు రోజులు పాటు డ్రోన్ శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన సిబ్బందికి మెలకువలు నేర్పించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలతో సన్నిహితంగా ఉండాలని, ప్రజా సమస్యల ఫిర్యా దు వేదికకు వచ్చే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. ఏఎస్పీ రాజశేఖర్ రాజు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఉద్యోగమేళా రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జి ల్లా ఉపాధి అధికారి పద్మజ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ఉద్యోగమేళాలో పలు జాతీయ కంపెనీలు పాల్గొంటాయ న్నారు. జిల్లాలో డిప్లొమా, ఐటీఐ, ఇంటర్మీడియ ట్, డిగ్రీ పూర్తి చేసి 19–35 సంవత్సరాల వ యస్సులోపు ఉన్న నిరుద్యోగులు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ నెల 28వ తే దీన విద్యార్హత సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

ఒకే ఈతలో 4 పిల్లలు



ఒకే కాన్పులో 4 పిల్లలకు జన్మనిచ్చిన మేక

బైరెడ్డిపల్లె: మండలంలోని కుప్పనపల్లె గ్రామానికి చెందిన నాగరాజు మేకలను పెంచుతూ జీవిస్తున్నాడు. తన మేకల మందను శనివారం మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకెళ్లగా మందలోని ఓ మేక 4 పిల్లలకు జన్మనిచ్చింది. సాధారణంగా మేకలు ఒకటి, రెండు పిల్లలను మాత్రమే వేస్తాయని, 4 పిల్లలు ఒకే కాన్పులో వేయడంతో రైతు నాగరాజు ఆనంద పడ్డాడు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పుంగనూరు: మండలంలోని రాంపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మోటారుసైకిల్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. దీనిని గమనించిన ఆప్రాంత వాసులు 108లో బాధితుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వెదురుకుప్పం: మండలంలోని మారేపల్లె సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 35–40 సంవత్సరాల మధ్యలో ఉంటుందని 5 అడుగుల 5 అంగుళాల పొడవు ఉన్నట్లు చెప్పారు. తను వేసుకున్న పింక్ కలర్ షర్ట్‌తో చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడి ఎడమ చేతిపై షీలా అని ఆంగ్లంలో పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. కాగా మృతుడి వివరాలు తెలిస్తే 9440900691 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

బాలికల భద్రతే.. దేశ బాధ్యత



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి

చిత్తూరు కలెక్టరేట్ : కిశోర బాలికల భద్రతే దేశ బాధ్యత అని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.వెంకటేశ్వరి అన్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జిల్లాస్థాయిలో కిశోరవికాసం– సమ్మర్ స్పెషల్ కార్యాచరణపై మండల స్థాయిలో వివిధ శాఖల నుంచి హాజరైన నోడల్ ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ కిశోర బాలికల సాధికారతకు ప్రతి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో అమలు చేయాల్సిన ప్రత్యేక క్యాలెండర్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆ క్యాలెండర్ ప్రకారం గ్రామాల్లో ప్రత్యేక కార్యచరణ అమలు చేయాలన్నారు. బాల్య వివాహాల కట్టడికి అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు. నేడు చాలా వరకు అన్నీ పోటీ పరీక్షలలో బాలికలదే పైచేయిగా ఉన్నప్పటికీ, ఎంతో మంది కిశోర బాలికలు తమ కలలను నెరవేర్చుకోక ముందే బాల్య వివాహాలకు బలైపోతున్నారని అన్నారు. మరి కొంతమంది బాల కార్మికులుగా మారిపోతున్నారని చెప్పారు. మరొకవైపు బాలికలు ఇంటా బయట, తెలిసిన వ్యక్తుల చేతుల్లో లైంగిక వేదింపులకు గురై చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతున్నారన్నారు. మరికొంత మంది తెలియని తనంతో ప్రేమ, ప్రలోభాలకు గురై, నమ్మి మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) డాక్టర్ దాసరి సుబ్రహ్మణ్యం, ఐరాల ఎంపీడీఓ ధనలక్ష్మి, సమగ్రశిక్ష జీసీడీఓ ఇంద్రాణి, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



సబితాపాత్ర మృతదేహం

శాంతిపురం: రెండు నెలల క్రితం వివాహమైన మహిళ మండల కేంద్రంలో అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తుమ్మిశికొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం(30) అనే వ్యక్తికి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం గొలపల్లికి చెందిన బైరాడాపాత్ర కుమార్తె సబితాపాత్ర(26)తో గత ఫిబ్రవరిలో వివాహమైంది. టెంపో నడుపుకుని జీవిస్తున్న సుబ్రమణ్యం భార్యతో సహా శాంతిపురంలోని శివాలయం ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతడు రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంట్లో గడియ పెట్టుకున్న భార్య తలుపు తీయకపోయవడంతో స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రాళ్లబూదుగూరు పోలీసులు వచ్చి తలుపులు తెరిచి చూసే సరికి ఫ్యానుకు ఉరి వేసుకుని ప్రాణాలు విడిచిన సబితా కనిపించింది. దీంతో మృతదేహాన్ని కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో పోలీసులు తదుపరి చర్యల కోసం ఎదురుచూస్తున్నారు.

కాణిపాకంలో భద్రత కట్టుదిట్టం



కాణిపాకంలో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్ బృందం

కాణిపాకం: ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంపై శనివారం పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఆలయం పరిసరాల ప్రాంతాల్లో సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారు. ఆలయ భద్రతపై అధికారులతో పోలీసులు చర్చించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పసిగట్టేగా నిఘా వ్యవస్థ పనిచేయాలన్నారు.

నగరిలో కొండముచ్చు హల్‌చల్



పట్టణంలో ఒక ఇంటి వద్ద కొండముచ్చు

నగరి : పట్టణంలో శనివారం ఒక కొండముచ్చు హల్‌చల్ చేసింది. ఎక్కడో అడవుల్లో మాత్రమే కనిపించే కొండముచ్చు దారితప్పి ఎలాగో నగరి పట్టణానికి వచ్చేసింది. దీన్ని చూడడానికి స్థానికులు, చిన్నారులు ఆసక్తి చూపారు. అరటి పండ్లు, టెంకాయలు అందిస్తూ దాని వెంట పడ్డారు.

తెగిన వైర్లు.. 50 మామిడి చెట్లు ధ్వంసం



తెగిన విద్యుత్ వైరు

వెదురుకుప్పం: మండలంలోని చెంచుగుడి సమీపంలో శనివారం సాయంత్రం 220 కేవీ విద్యుత్ లైన్ తెగిపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో 50 మామిడి చెట్లు ధ్వంసం అయ్యాయి. సాయంత్రం సమయంలో ఉన్నట్టుండి హఠాత్తుగా పెద్ద శబ్దంతో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందారు. పొలాలపై విద్యుత్ వైర్లు పడడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో రైతు లోకేష్ రెడ్డికి చెందిన 50 మామిడి చెట్లు విరిగిపోయినట్లు బాధితుడు తెలిపారు. మామిడి కాయలు నేలరాలినట్లు పేర్కొన్నారు.

పలమనేరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28వ తేదీన పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి, పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఐరాలలో చిరుత సంచారం

ఐరాల: మండలంలోని నగరి, చెంగనపల్లె గ్రామాల్లో చిరుత పులుల సంచరిస్తున్నాయి. శనివారం చెంగనపల్లె సమీపంలోని బంగారుచింతల గ్రామానికి చెందిన రైతు మల్లీశ్వర్‌రెడ్డి మామిడి తోటలో చిరుత పులి పాదముద్రలను పోలిన ముద్రలు కనిపించాయి. విషయాన్ని వెంటనే ఐరాల బీట్ అధికారి రెడ్డి ప్రసాద్‌కు తెలిపారు. దీంతో ఆయన ఉదయం మామిడి తోటలో పాదముద్రల గుర్తులున్న ప్రాంతానికి వెళ్లి వాటిని సేకరించారు. పాదముద్రలను గుర్తించడం కోసం ఫొటోలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. కాగా ఈ పాదముద్రలు దగ్గర దగ్గరగా ఉన్నాయని, చిరుత పులి పాదముద్రలు దూరం దూరంగా ఉంటాయని చెప్పారు. అయితే నగరి, చెంగపల్లె సమీపంలోని పెద్ద కొండలో నాలుగు చిరుత పులులు సంచరిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి కోసం పెద్దకొండ నుంచి దుర్గంకు వెళ్లే దారిలో మామిడి తోటలో నీటి కోసం చిరుత పులులు వస్తున్నట్లు చెప్పారు.

30న జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 30వ తేదీన జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ప్రత్యేక ఆహ్వానితులుగా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ఈ సమావేశం నిర్వహణ, అజెండా అంశాల ఏర్పాటుకు సంబంధించి డీఆర్వో మోహన్‌కుమార్ క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఇక్కడ అధ్యాపకులు.. అక్కడ విద్యార్థులు

- ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్, ప్రైవేటు కాలేజీలో స్టూడెంట్!
- తాను పని చేసే కాలేజీలోనే స్టూడెంట్‌గా పరీక్ష రాస్తున్న వైనం
- ఎస్వీయూ అధికారులకు ఫిర్యాదు

పలమనేరు/బంగారుపాళెం: వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తూ అదే కళాశాలలో విద్యార్థులుగా అవతారమెత్తి బీఈడీ పరీక్షలు రాస్తున్న ఘటన పలమనేరులో వెలుగుచూసింది. దీని వెనుక అసలుకథే ఏమంటే.. స్థానిక డిగ్రీ కళాశాలలో పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారే బంగారుపాళెంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఈడీ విద్యార్థులుగా ఉన్నారు. అక్కడ కళాశాలకు వెళ్లకుండానే ఇక్కడి డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అధ్యాపకులైనందున బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ అసలు పట్టించుకోలేదు. కట్ చేస్తే ఇప్పుడు బీఈడీ పరీక్షలు మొదలయ్యాయి. బంగారుపాళెం బీఈడీ కళాశాల విద్యార్థులకు పలమనేరు డిగ్రీ కళాశాల సెంటర్ వచ్చింది. ఇదెలా సాధ్యమో? దీని వెనుక ఎవరున్నారనేది ఓ ప్రశ్నగా మారింది. పలమనేరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు అదే కళాశాలలో విద్యార్థులుగా బీఈడీ పరీక్ష రాస్తుండడంతో వారికి అడ్డు లేకుండా పోయింది. ఎందుకంటే ఈ సెంటర్‌లోని ఇన్విజిలేటర్లు అందరూ వారి సహచరులే కావడం గమనార్హం. బంగారుపాళెం బీఈడీ కాలేజీ అధ్యాపకులు వెళ్లడం లేదు. వీరికి పలమనేరు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సహకారం అందించి రుణం తీర్చుకుంటున్నారు. అదెలాగంటే ఇక్కడి సెంటర్‌లో పరీక్ష రాసే బీఈడీ విద్యార్థులు ఎక్కువ మంది పాసు కావాలని ఇక్కడి సెంటర్‌లో మాస్ కాపీయింగ్ సైతం చేయిస్తున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ప్రైవేటు కళాశాల బీఈడీ విద్యార్థిగా ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ డబుల్‌రోల్‌తో పరీక్ష రాస్తుండడం బీఈడీ విద్యార్థులకంతా బాగా కలిసొచ్చిందనే మాట వినిపిస్తోంది. ఈ అధ్యాపకుల వ్యవహారంపై కొందరు ఎస్వీయూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం బయటపడింది. దీనిపై స్థానిక ప్రిన్సిపల్ వెంకటేశులును వివరణ కోరగా ఈ విషయం ఇప్పటివరకు తన దృష్టికి రాలేదని దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్, సహాయ సెక్టోరల్ పోస్టులకు అర్హత, ఆసక్తి ఉన్న ప్రభుత్వ టీచర్లు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో పనిచేస్తూ అర్హులైన ఇన్ సర్వీస్ స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు మే 5వ తేదీలోపు దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వయస్సు 55 సంవత్సరాలు దాటిన టీచర్ల దరఖాస్తులు స్వీకరించబోమని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం 5 సంవత్సరాలు, ఎస్జీటీగా కనీసం 8 సంవత్సరాల సర్వీస్ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నాటికి కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. దరఖాస్తులు, ఇతర వివరాలకు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సంప్రదించాలని ఏపీసీ కోరారు.

జాగ్రత్తగా పనిచేసుకోండి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎందుకు మా వరకు ఫిర్యాదులొస్తున్నాయి. మీరెందుకు పనిచేయడం లేదు..జాగ్రత్తగా పనిచేసుకోండని కలెక్టర్ సుమిత్‌కుమార్ సుతిమెత్తగా హెచ్చరించినట్లు తెలిసింది. ఈనెల 19వ తేదీన సాక్షి దినపత్రికలో 'చిన్నపనైనా.. చేయి తడపాల్సిందే' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందించినట్లు తెలిసింది. అధికారుల ఇచ్చిన సమాచారం మేరకు.. సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది, వీఆర్వోలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. ముందుగా ఓ సర్వేయర్‌కు వార్నింగ్ ఇచ్చారు. హిట్ లిస్టులో ఉన్నవని, మంచిగా పనిచేయాలని హెచ్చరించారు. వీర్వోలు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారని, ఫిర్యాదులన్నీ అర్బన్ నుంచి అత్యధికంగా వస్తున్నాయన్నారు. ఎందుకు ఫిర్యాదుదారుల నుంచి వినతులు తీసుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. పద్ధతి మార్చుకుని, పనిచేయాలని హుకుం జారీ చేశారని సమాచారం. కాగా ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఓ సర్వేయర్ తప్పిదాలు, నిర్లక్ష్యంను గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమైన సమాచారం. షోకాజ్ నోటీసులో తహసీల్దార్ సంతకం పెడితే సోమవారం ఆ సర్వేయర్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ముమ్మరంగా తనిఖీలు

చిత్తూరు అర్బన్: కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేశారు. జన సంచారం ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ.. ప్రజల్ని చైతన్యం చేయాలని ఎస్పీ మణికంఠ పోలీసులను ఆదేశించారు. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద బ్యాగులు, వ్యక్తులు కనిపించినపుడు ఫోన్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: కరెంటు బిల్లులను వినియోగదారులు ఆదివారం కూడా కట్టవచ్చని ట్రాన్స్‌కో చిత్తూరు, తిరుపతి జిల్లా ఎస్‌ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. సాధారణ రోజుల మాదిరి విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని వారు కోరారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యం



నాగభూషణరెడ్డిని సత్కరిస్తున్న కోటూరుకు చెందిన నేతలు

చౌడేపల్లి: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆ మండల అధ్యక్షుడు జి. నాగభూషణరెడ్డి అన్నారు. శనివారం పెద్ద కొండామర్రిలో కోటూరుకు చెందిన మైనార్టీ నేతలు, పార్టీ నాయకులతోపాటు బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ తదితర నేతలు కలిసి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, ప్రజల్లో చైతన్యం తేవడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని కోరారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కార్యక్రమాలకు స్వీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాఫర్, ఇంమ్రాన్, ఫయాజ్,రాంబాబు, హుస్సేన్, మల్లికార్జున, అజారుద్దీన్, సలీం, అలీ, మునిగిరిబాబు,శ్రీరాములు, వెంకీ, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.